క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోటిలింగాల ప్రతిష్ఠ, పంచలోహ లింగం నిర్మాణం కోసం కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ చీర్ల యాదయ్యసాగర్, మంజుల దంపతులు తమ వంతు సహాయంగా రూ.27,116 విరాళంగా ఆలయ నిర్వాహకుడు శేఖరయ్యకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న పుణ్య కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని నిర్వాహకులు కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఖిల్లాఘనపురం: మండలంలో పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మంగళవారం మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డులో ఎస్‌ఐ శ్రీహరి ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున వాహనాల్లో నిబంధనలకు మించి బంగారం, నగదును తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి వాటిని అరికట్టేందుకు తరుచుగా రోడ్లపై తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మండలంలోని గోప్లాపూర్, కిష్టాపూర్ తండా, రేమద్దుల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటి వసతి, మరుగుదొడ్లు, దివ్యాంగులకు అనువుగా ర్యాంపులు నిర్మాణం వంటి వసతులు ఉండేలా సర్పంచ్‌లు, పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇంటింటి ప్రచారం

వనపర్తి టౌన్: వనపర్తి నియోజకవర్గంలో అన్ని పార్టీలకు అవకాశమిచ్చారని, ఒక్కసారి బీజేపీకి అవకాశమివ్వాలని వనపర్తి నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనుజ్ఞారెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీతారాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కొమ్ము సామెల్, పెద్దిరాజు, రాములు, రాయన్న సాగర్ పాల్గొన్నారు.

ప్రచార పర్వం

పాన్‌గల్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియమ్మ రుణం తీర్చుకునేందుకు ఒక్కసారి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని శాగాపూర్, శాగాపూర్‌తండాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేష్‌నాయుడు, రవికుమార్, బాలస్వామి, గోవర్ధన్‌సాగర్, జయరాములుసాగర్ ఉన్నారు.

మదనాపురం: మండలంలోని ద్వారకనగరం, కొన్నూరు, పెద్ద తండా, నర్సింగాపురం తదితర గ్రామాల్లో మంగళవారం దేవరకద్ర కాంగ్రెస్ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న, యుగంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: తెలంగాణ ప్రజల గోసను చూసి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రంగా ఇస్తే కేసీఆర్ కుటుంబం చేతిలో దారుణంగా మోసపోయామని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వేముల శ్రీనివాస్‌రెడ్డి, సాయిలుయాదవ్, లక్ష్మయ్యయాదవ్, దిలీప్, మోహన్‌రెడ్డి తదతరులు ఉన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని బాలకిష్టాపూర్, పిన్నంచర్ల, కర్వెన, గోపన్‌పేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీడీ శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కేటీదొడ్డి: వెంకటాపురంలోని సోమవారం మొదలైన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు రెండోరోజు కనులపండువగా కొనసాగుతున్నాయి. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



సల్కెలాపురంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వనపర్తి టౌన్: అన్ని సౌకర్యాలు, వసతులు ఉండి విలాసవంతంగా జీవించగలిగే శక్తి సామర్థ్యాలున్నప్పటికీ దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పోరాడిన వ్యక్తి జవహర్ లాల్ నెహ్రూ అని మాజీ మంత్రి చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్‌తో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్, ఖమ్మర్‌మియా, అనీస్, సత్యారెడ్డి, కోట్ల రవి, చీర్ల జనార్దన్, నాయకులు కదిరె రాములు, పర్వతాలు, సుమిత్ర యాదగిరి, దివాకర్ యాదవ్, బాబా రోహిత్ పాల్గొన్నారు.

అమరచింత: నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని ఐదవ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు చాచా నెహ్రూ వేషధారణతో బాలల దినోత్సవాన్ని జరుపుకొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సల్కెలాపురంలో చైతన్య భారతి యువజన సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అప్పారెడ్డిపల్లి, ఖిల్లాఘనపురం పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా చదువుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు సంజీవ్, నవీన్‌కుమార్, స్వప్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బాలీశ్వరమ్మ, మంజులరాణి, నాగమ్మ, పర్వీన్‌బేగం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు మిఠాయిలను పంచి పెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, శేఖర్, రజిత, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, మహేశ్వరి, హెల్పర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: బాలలదినోత్సవం, పండిట్ జవహర్ లాల్‌నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూర్‌లోని శ్రీవాణి హైస్కూల్లో మంగళవారం వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఆట, పాటలతో అలరించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కరస్పాండెట్ టీజే విశ్వేశ్వర్ బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: నేటి బాలలే రేపటి పౌరులుగా తయారువుతారని, తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలను సన్మార్గంలో నడిపించాలని వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.



వనపర్తిలో..



శ్రీరంగాపూర్‌లో..



అమరచింతలో..

64 మినీ ఎత్తిపోతల పథకాల ఏర్పాటు



వనపర్తిలో బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట: వనపర్తి నియోజకవర్గాన్ని ప్రభుత్వం ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 64 మినీ ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందించామని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశామన్నారు. తన పనితీరు చూసి గత ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించారని, మరోసారి అది పునరావృతం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఇంజినీరింగ్, మెడికల్, ఫిషరీస్, వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఆయన వెంట నాగం జనార్దన్‌రెడ్డి, ఎంపీపీలు సంధ్య, సేనాపతి, జెడ్పీటీసీలు భార్గవి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చందాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి మంత్రి నిరంజన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి అన్నారు. పార్టీలో చేరిన వారిలో సహదేవ్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. కార్యక్రమంలో నాగం తిరుపతిరెడ్డి, గట్టుయాదవ్, చిన్నారెడ్డి, కురుమూర్తియాదవ్, మాణిక్యం, రమేష్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, చంద్రయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

వనపర్తి మండలంలోని అప్పాయిపల్లి, అంజనగిరిలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి, కుమార్తె తేజశ్విని స్థానిక నాయకులతో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, శివన్న, మాధవరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, విష్ణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా



కత్తేపల్లిలో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన యువకులు

మక్తల్: ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారరు. ఆయన మక్తల్, ఊట్కూర్ మండలంలోని జోరుగా ప్రచారం చేస్తున్నారు. కార్యకర్తలందరూ పార్టీ గెలుపు కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు. ఊట్కూర్ మండలంలోని అమీన్‌పూర్, సామానూర్‌లో, మక్తల్ మండలంలోని జక్లేర్‌లో జలంధర్‌రెడ్డికి మద్దతుగా ఆయన భార్య పద్మజారెడ్డి ప్రచారం చేస్తున్నారు.

బీజేపీ గెలుపునకు కృషి

ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని రాష్ట్ర బీజేపీ కార్యవర్గసభ్యుడు కొండయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని వైస్ చైర్మన్ అఖిల రాజశేఖర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంపల్లి కొండయ్య, కర్ని లక్ష్మి, ప్రసన్నరెడ్డి, అర్చన, ఎంపీటీసీలు తిమ్మప్ప బాల్‌రాంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్నిస్వామి, మండల అర్బన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, లక్ష్మన్, ప్రతాప్‌రెడ్డి, నాగప్ప, శ్రీకాంత్, రాములు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో ఆశీర్వదించి అవకాశం కల్పించాలని బీజేపీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తూంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, వీరరాఘవపూర్, పిన్నంచర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పిన్నంచర్ల మాజీ సర్పంచ్ అరుంధతి, శివానంద్‌రెడ్డితోపాటు ఆరేపల్లిలో 50 మంది ఆయా పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కమలంపువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చిన్ననర్సింహ, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం



కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ ద్వారానే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని 7, 8 వార్డులకు చెందిన వడ్డెర సంఘం నాయకులు, వాల్మీకి బోయలతో పాటు స్థానికులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడుతున్నారని, జనం మాత్రం తమ వెంటే ఉన్నారన్నారు. పార్టీలు మారే వారిని ప్రజలు కూడా గమనిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని జోస్యం చెప్పారు.

పాన్‌గల్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను గడప, గడపకు వివరిస్తూ కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ సమన్వయ కర్త రంగినేని అభిలాష్ రావు, ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, బండపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలంటే మరోసారి హర్షవర్ధన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్యనాయుడు, జ్యోతినందన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రఘుపతినాయుడు, శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని జనుంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు జోగు నాగశేషు, రాములు, ఉస్సేన్, కిష్టయ్య, వీరస్వామితో పాటు మరి కొంత మంది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మిద్దెల కృష్ణ, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందిన మద్దూరి గోవింద్, వయస్సు 50 సంవత్సరాలు. ఈ నెల 11వ తేదీన కర్నూల్‌లోని ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి ఆయన ఇప్పటి వరకు ఇంటికి రాలేదని ఆయన భార్య పద్మమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై స్థానిక ఎస్‌ఐ ఓబుల్‌రెడ్డి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జడ్చర్ల అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా కృష్ణవర్ధన్‌రెడ్డి

మదనాపురం: ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అసెంబ్లీ కోఆర్డినేటర్లను నియమించారు. అందులో భాగంగా జడ్చర్ల అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా మదనాపురం మండలంలోని అజ్జకొల్లుకు చెందిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణవర్ధన్‌రెడ్డిని నియమించారు.

క్రీడాకారిణికి సన్మానం



పెబ్బేరు రూరల్: పెబ్బేరు మండలంలోని యాపర్లకు చెందిన ఖోఖో జాతీయ క్రీడాకారిణి కావలి రుక్మిణిని మంత్రి నిరంజన్‌రెడ్డి సన్మానించారు. రుక్మిణి వికారాబాద్ సంగం లక్ష్మీబాయి జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జాతీయ స్థాయి ఖోఖో అండర్-17 విభాగంలో జాతీయ జట్టుకే తెలంగాణ నుంచి ఎంపికైంది. మలేషియాలోని మెలకలో ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 12నుంచి 15వరకు జరిగిన ఇంటర్నేషనల్ ఖోఖో పోటీల్లో భారత్ తలపడి గెలించింది. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన రుక్మిణిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తకోట: ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో కొత్తకోట పట్టణ కేంద్రంలోని కేపీఎస్ విద్యార్థులు వై.శ్రీఅశ్విన్ గాత్ర సంగీతంలో, పి.సంహత శాస్త్రీయ నృత్యంలో, ఎండీ జావిద్ నాటక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్/మదనాపురం: నియోజకవర్గం నుంచి మరోసారి తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాయిణిపేట, ముమ్మళ్లపల్లి, ఉల్లెంకొండ తండా, ఉల్లెంకొండ గ్రామం, నాచారంపేట తండాల్లో ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం చర్లపల్లి, వడ్డెవాటకు చెందిన వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ ఆకుల శ్రీను తదితరులు ఉన్నారు.

మదనాపురం మండలంలోని కొన్నూరులో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షులు జయంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలొద్దు

ఆత్మకూర్: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత హామీలను నమ్మకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం తపిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యే గెలిపించాలని ఆయన కుమారుడు చిట్టెం చాణక్యరెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి, విజయభాస్కర్‌రెడ్డి, బంగారు శ్రీను, శ్రీధర్‌గౌడ్, శివరంజని, కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వీపనగండ్ల: దీపావళి పండుగ, గంగమ్మ జాతర సందర్భాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం ప్రజాప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు. మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్, శివయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతిని వీపనగండ్ల జట్టు గెలుచుకోగా వారికి రూ.10 వేల నగదు, రెండవ బహుమతి గెలుచుకున్న నాగులపల్లి జట్టుకు రూ.8 వేలు, మూడో బహుమతి గెలుచుకున్న సంగినేనిపల్లి జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, శివయాదవ్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, ఆశన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పూజలు



జలాధివాసం చేస్తున్న భక్తులు



హోమం చేస్తున్న పూజారులు

అమరచింత: పట్టణంలో మంగళవారం నూతన బొడ్రాయి పూజోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో పది చోట్ల బొడ్రాళ్లను ప్రతిష్ఠించేందుకు యంత్ర ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. బొడ్రాళ్ల జలాదివాసం, హోమం చేశారు. పట్టణంలోని మహిళలు రాగి చంబులతో నీళ్లను తీసుకొచ్చి బొడ్రాళ్లకు అభిషేకించారు. భక్తులతో ఆంజనేయ ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. బుధ, గురువారాల్లో బొడ్రాళ్ల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషణంగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కొట్టం విష్ణువర్ధన్‌రెడ్డి, తాటికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బంతిపూల కోతపై రైతులకు అవగాహన



బిజినేపల్లి: వివిధ రకాల పూలసాగులో వాటిని కోత కోసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సులభమైన పని విధానంపై మహిళా రైతులకు మంగళవారం పాలెం కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. గులాబీ, చామంతి, బంతి, వంటి పూలను కోసే వారు సంచులను కాకుండ నడుముకు కట్టుకునే బుట్టలు వినియోగించాలని సూచించారు. పూల కోత బుట్టలపై రైతులకు ప్రదర్శనాత్మకంగా చూయించారు. కార్యక్రమంలో పాలెం కేవీకే శాస్త్రవేత్త డా. ఆదిశంకర్, మహిళా కూలీలు ఉన్నారు.

'అవినీతిపై పోరాడుదాం'

పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన 50మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోవింద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి వనపర్తి నియోజవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మేఘారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని మేఘారెడ్డి సూచించారు. నియోజకవర్గంలో అధికారం పార్టీ నాయకుల అవినీతి పెరిగిపోయిందని, వారి అక్రమాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సుధాకర్, పరశురాములు, కుర్మయ్య, ఎల్లస్వామి, కేశవులు, హన్మంత్, మహేందర్, సాయికుమార్, మైబు, అంజి, రంగన్న, బాలస్వామి తదితరులు ఉన్నారు.

